Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి (Vol) : 11 సంచిక (Issue) : 50 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

గురువారం, 9 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

# లక్ష్యాల మేరకు రాజధాని పనులు పూర్తి చేయాలి

**- వేగం మరింత పెరగాలి... ఐకానిక్ ముద్ర కనిపించాలి - నిర్మాణ సంస్థలు కడుతోంది కేవలం బిల్డింగులు కాదు... రాజధాని - రాజధాని పనులకు గ్రీన్ ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్ - ప్రభుత్వ శాఖలు, అధికారులు సమన్వయంతో జాప్యం లేకుండా చూడాలి - అమరావతి రాజధాని పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు - రాజధానిలో అగ్నిప్రమాదాలపై సీఎం అసంతృప్తి... నిర్మాణ సంస్థలదే బాధ్యతని స్పష్టం**

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామని.. ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని... చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలవైన పనులు ఉండగా... వాటిల్లో రూ. 50, 943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్ పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికి తెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా చాలా మంది కార్మికులు వెళ్లారని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత





వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా... ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను... నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే... వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే వర్షా కాలంలో పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి... ఆలోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులను చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దృష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు... ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలి. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్ధేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే.. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది... ప్రతీ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యమెందుకు...?**

సమీక్ష సందర్భంగా ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయన్నారు. ఘటన జరిగిన తర్వాత కాంట్రాక్టు సంస్థలు కానీ... అధికారులు కానీ తగిన రీతిలో స్పందించలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని... ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా... ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు.. బురద జల్లేందుకు, కుట్రలు పన్నేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆయా నిర్మాణ సంస్థలు కూడా ప్రాజెక్టు మేనేజర్లుగా సమర్ధులను నియమించుకోవాలని సూచించారు. సరైన వాళ్లని నియమించుకోకుంటే... ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తాను అనుమతించనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లకు ఆదేశాలు**

రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలో ఫారెస్ట్ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని..జిల్లా కలెక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుం టున్నా...ఫారెస్ట్ అధికారులతోనే అసలు సమస్య వస్తోందనే విషయం సమావేశంలో సీఎం దృష్టికి వచ్చింది. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని.. ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.










**అమరావతిలో మొదటి ఏఐ ఫ్యూజన్ సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, నిర్వాహకులు ఏపీ టీ టి ఐ, దీప్టెక్ నైపుణ్య ఫౌండేషన్, ఎస్టీపీఐ. ఈ సదస్సులో పాల్గొన్న ఏపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు, రాజధాని వార్తలు ఎడిటర్.**

# పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం.. లారీ కింద పడి దంపతుల మృతి

**సత్తెనపల్లి, (రాజధాని వార్తలు):** నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ఎంతోమంది అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు ఎన్నిసార్లు చెబుతున్నా..వాహనదారులు వినిపించుకోవడం లేదు. ఏపీలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద బైక్ అదుపు తప్పి లారీ కిందపడటంతో వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి చెందిన అంజయ్య (63), కోటేశ్వరమ్మ (60) దంపతులు ఒక శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్ పై పిడుగురాళ్ల వైపు బయలుదేరారు. సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్ వద్దకు చేరుకోగానే బైక్ ఒక్కసారిగా అదుపు తప్పింది. ఆ సమయంలో పక్కనే వెళ్తున్న లారీ కిందకు బైక్ దూసుకుపోవడంతో, లారీ చక్రాలు వారిపై నుంచి వెళ్లాయి. తీవ్ర గాయాల పాలైన అంజయ్య, కోటేశ్వరమ్మలు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

**చిలకలూరిపేటలో ఘోర ప్రమాదం..**

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలో శనివారం ఘోర



రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పర్చూరు తహశీల్దార్ బ్రహ్మయ్య ప్రయాణిస్తున్న కారు మోపెడ్‌ను ఢీకొట్టిన ఘటనలో.. ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. పసుమర్తి గ్రామ సమీపంలోని నూతన నేషనల్ హైవేపై ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వనపర్తి గ్రామానికి చెందిన సుధాకర్ స్థానిక కోల్డ్ స్టోరేజ్‌లో పని చేస్తున్నాడు. శనివారం పని ముగించుకుని తన బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా, పసుమర్తి హైవే వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన తహశీల్దార్ కారు సుధాకర్ వాహనాన్ని ఢీకొట్టింది. సుధాకర్ టూవీలర్‌ను కారు సుమారు 300 అడుగుల మేర ఈడ్చుకుపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందారు. చిలకలూరిపేట పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# అమరావతి రాజధానిగా.. ఏపీ కొత్త మ్యాప్ ఇదే..



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు.

**అమరావతికి రాజధానిగా ప్రత్యేక గుర్తింపు..**

ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని'గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.


# మాచర్ల అత్యాచార ఘటనపై మహిళా కమిషన్ సీరియస్



**అమరావతి, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై అత్యాచారం ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ అమానుష ఘటనపై ఏపీ మహిళా కమిషన్ సీరియస్ అయ్యింది. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని, బాధిత మహిళను ఆదుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బాధితురాలిని కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఫోన్‌లో పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా కమిషన్, ఏపీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆదేశించారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రతపై రాజీ పడే ప్రసక్తే లేదని కామాంధులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆడవారి జోలికొస్తే ఎంతటి వారైనా ఉపేక్షించమని స్పష్టం చేశారు. మహిళల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు. బాధితురాలికి అన్ని విధాలా సహాయం అందించాలని సూచించారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో బాధిత మహిళ చికిత్స పొందుతున్నారు. కాగా, ఏప్రిల్ 2న సాయంత్రం 4గంటల ప్రాంతంలో పల్నాడు జిల్లా మాచర్లలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఇంటికి వెళ్లాడు నిందితుడు. మంచి నీళ్ల నెపంతో తలుపు తప్పి అనంతరం బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించాడు. సదరు మహిళ నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమెను కత్తితో గాయపరిచి మర్మాంగాలపైనా రాడ్డుతో దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో బాధితురాలు ఆస్పత్రిలో చేరింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# 'అమరావతి'కి మద్దతుగా నిలిచిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు

## - కాకినాడ పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంటు ఆమోదించడం సంతోషంగా ఉందని, పెద్దన్నలా అండగా ఉండి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంటు ఉభయ సభల్లో రాజధాని బిల్లు ఆమోదం పొందడంతో గురువారం ప్రధాని నరేంద్ర మోడీని, అలాగే సహకరించిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలపడం జరిగిందని, చారిత్రాత్మక బిల్లు ఆమోదం పొందిన తర్వాత జనసేన పార్టీ తరఫున, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున ప్రధాని మోడీని కలిసి కృతజ్ఞతలు తెలపడం గర్వంగా భావిస్తున్నానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. కుట్రలు, అవాంతరాలు ఛేదించుకుని నేడు రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్ట భద్రత కలిగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో త్వరలోనే దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా, ప్రపంచ శ్రేణి నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇక సమున్నతంగా అమరావతి నగర నిర్మాణం

## - రైతుల త్యాగాలకు నేడు పూర్తి భరోసా దక్కింది - తెదేపా యువ నాయకులు బండారు సంజీవ్

## - రాజ్యసభలో అమరావతి బిల్లు పాసైన నేపథ్యంలో కొత్తపేటలో ర్యాలీ నిర్వహించిన సంజీవ్



**కొత్తపేట, (రాజధాని వార్తలు):** లోక్సభ, రాజ్యసభల్లో ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందడంతో ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతి మహోన్నతంగా అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం యువ నాయకులు సంజీవ్ తెలిపారు. అమరావతి సభలో ఆమోదం పొందిన సందర్భంగా గురువారం ఆయన మరియు ఆకుల రామకృష్ణ కూటమి నాయకులు జాతిపిత మహాత్మగాంధీ,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, తెలుగు ఆత్మగౌరవ ప్రతీక అన్న ఎన్టీఆర్, దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొత్తపేట బస్టాండ్ సెంటర్ నుంచి కమ్మిరెడ్డిపాలెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ పూర్వం దేవతలు యజ్ఞం చేస్తుంటే రాక్షసులు అడ్డుకునే వారిని ఆ విధంగా అమరావతి నగర నిర్మాణాన్ని వైసిపి నాయకులు, జగన్ అడ్డుకున్నారని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం, ఒక్క వైసీపీ తప్ప, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతి ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా రూపొందించిన బిల్లుకు మద్దతు తెలపడంతో ఇక నగర నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలగిపోయాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో అమరావతి సమున్నతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

# ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దిశానిర్దేశంలో అభివృద్ధి జోరు

## - కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి - పినపళ్ల గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం... ప్రజల మన్ననలు పొందుతున్న ఎమ్మెల్యేసత్యానంద రావు

**ఆలమూరు, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలంలోని పినపళ్ల గ్రామం గురువారం అభివృద్ధి వేడుకలతో కళకళలాడింది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో పలు కీలక అభివృద్ధి పనులకు ఘనంగా శ్రీకారం చుట్టడం ద్వారా గ్రామంలో కొత్త ఆశలు మొలకెత్తాయి. గ్రామాభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, కూటమి ప్రభుత్వ సంకల్పంతో కలసి ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి.గ్రామ రూపురేఖలను మార్చే దిశగా కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ముఖ్యంగా ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నిధులతో రూ. 30 లక్షల వ్యయంతో బహుళ ప్రయోజన సముదాయ భవనం నిర్మాణం ప్రారంభమవగా, 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ. 36 లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో గ్రామ ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ హెల్త్ సెంటర్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలాగే జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 42.20 లక్షలతో ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్లు కల్పించే పనులను ప్రారంభించారు. ఇవే కాకుండా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ తాగునీరు, మెరుగైన ఆరోగ్య సేవలు, సమాజానికి ఉపయోగపడే మౌలిక వసతులు అందించడం ద్వారా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని తెలిపారు. ఆయన నాయకత్వంలో కొత్తపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కార్యక్రమానికి హాజరైన స్థానిక ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా అభినందించారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న చిత్తశుద్ధిని కొనియాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాలు కొత్త వెలుగులు చూస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఆలమూరు మండల కుటమి నాయకులు, మండల అధికారులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత రాజధానిగా అమరావతి నిలవడం చారిత్రాత్మకం

## - పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ - కొవ్వొత్తుల ప్రదర్శనతో అమరావతికి మద్దతు తెలిపిన టిడిపి శ్రేణులు

**పిఠాపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా నిర్ణయించబడటం చారిత్రాత్మక ఘట్టమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాలతో అమరావతికి మద్దతుగా గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 13 సంవత్సరాల పాటు చేసిన అహర్నిశ కృషి ఫలితంగా అమరావతి రాజధానిగా రూపుదిద్దుకుందని తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల ప్రతిపాదనతో రాష్ట్ర అభివృద్ధి వెనుకబడిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, అలాగే ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో అమరావతిని రాష్ట్ర రాజధానిగా అసెంబ్లీలో తీర్మానం చేసి, అనంతరం లోక్‌సభ, రాజ్యసభలలో ఆమోదం పొందడం రాష్ట్ర ప్రజలకు గర్వకారణమన్నారు. రాజధాని నిర్మాణానికి రైతులు నమ్మకంతో ఇచ్చిన సుమారు 39 వేల ఎకరాల్లో మిగిలిన భూములు రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఆస్తిగా మారాయని తెలిపారు. దాదాపు రూ.25 వేల కోట్ల విలువైన ఆస్తి ప్రభుత్వం సొంతమైందని పేర్కొన్నారు. రైతులకు న్యాయం




జరిగిందని, వారి విశ్వాసానికి గౌరవం లభించిందని అన్నారు. అమరావతి అభివృద్ధి వేగంగా కొనసాగుతుందని, భవిష్యత్తులో ఇది ప్రపంచ స్థాయి రాజధానిగా అవతరించి, ఎన్నో అంతర్జాతీయ సంస్థలు, బ్యాంకులు, ప్రముఖ సంస్థలు స్థాపించబడతాయని, దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పిఠాపురం ప్రజల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేసామనే సంతృప్తి మిగిలింది

**కొత్తపేట, (రాజధాని వార్తలు):** గ్రామానికి సర్పంచ్‌గా తన ఐదేళ్ల కాలంలో శక్తి మేరకు అభివృద్ధి చేశామనే సంతృప్తి మిగిలిందని గంటి గ్రామ సర్పంచ్ సాగి బంగార్రాజు అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం గురువారంతో ముగియడంతో అభివృద్ధిలో తనకు సహకరించిన వార్డు సభ్యులను, పంచాయితీ, సచివాలయం సిబ్బందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా తనపై నమ్మకంతో తనను సర్పంచ్‌గా గెలిపించి గ్రామానికి సేవ చేసే భాగ్యాన్ని కల్పించిన గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అదేవిధంగా గ్రామాభివృద్ధి విషయంలో తనకు సహకరించినందుకు పంచాయితీ, సచివాలయ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వార్డు సభ్యులు, పంచాయితీ, సచివాలయం



అధికారులు సిబ్బంది సర్పంచ్ బంగార్రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మట్టపర్తి వెంకట్రావు, భూపతి రాజు సత్యనారాయణ రాజు వార్డు సభ్యులు నేరేడుమిల్లి నరేష్, పంచాయతీ సెక్రెటరీ టి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# "చేనేత కుటుంబాలకు చంద్రబాబు ద్రోహం – కాకాణి"





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజక వర్గం, పొదలకూరు మండలం, మహ్మదాపురం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. చేనేతలకు చంద్రబాబు తీరని ద్రోహం చేశాడని పేర్కొన్న కాకాణి. జగన్మోహన్ రెడ్డి నేతన్న నేస్తం పేరిట చేనేత కుటుంబాలకు ప్రతి సంవత్సరం 24 వేల రూపాయల ఆర్థిక సాయం అందించాడన్న కాకాణి. చంద్రబాబు అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అని ప్రకటించాడన్న కాకాణి. క్షేత్రస్థాయిలో చేనేత కుటుంబాలకు చంద్రబాబు ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్న కాకాణి. ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కండ్లకూటి రమణారెడ్డి సతీమణి శ్రీలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించిన కాకాణి. నేతన్నలకు అన్ని విధాల అండగా నిలిచిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. నేతన్నలను కష్టాల నుండి విముక్తి కల్పించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో, జగన్మోహన్ రెడ్డి అనేక నిర్ణయాలు తీసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి చేనేత కుటుంబాలకు ప్రతి ఏడాది 24 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నాడు. చంద్రబాబు నాయుడు అన్ని వర్గాలను మోసం చేసినట్లు నేతన్నలను కూడా మోసం చేశాడు. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయిన సందర్భంలో, సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ చంద్రబాబు తనకు తానే ప్రకటించుకుంటున్నాడు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసి, ప్రజలను మోసగించడమే ధ్యేయంగా పని చేస్తున్నాడు. చంద్రబాబు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు చేనేత కుటుంబాలకు ఏమాత్రం సరిపోదు. చంద్రబాబు ప్రకటించిన 200 యూనిట్లలో కనీసం 10 శాతం చేనేత కుటుంబాలకు కూడా లబ్ధి చేకూరే పరిస్థితి కనిపించడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం మాటల ప్రభుత్వం, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేతల ప్రభుత్వం అంటూ, ప్రజలు భావిస్తున్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని, జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన తీరు గుర్తు చేసుకుంటే చంద్రబాబుకు ఓటు వేసి ఎంత పొరపాటు చేశామా అని, అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారు. ఆంధ్ర రాష్టంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా, మాట మీద నిలబడే జగన్మోహన్ రెడ్డి వెంట నడవడానికి ప్రజలు నిర్ణయించుకున్నారు. రాష్టంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా, మాయ మాటలు చెప్పి మోసగించిన, చంద్రబాబుకు తగిన శాస్తి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజల్లోకి ఎక్కడికి వెళ్ళినా జగన్మోహన్ రెడ్డి నాయకత్వం పట్ల అత్యంత విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి పేరు చెబితేనే ప్రజలలో ఎక్కడలేని ఉత్సాహం ఉరకలు వేస్తుంది. అధికారం ఉన్నా, లేకపోయినా ప్రతి సమస్యలో ప్రజల పక్షాన నిలబడి, పోరాడేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది.

# గోముకి నదిపై ఆక్విడెక్ట్ నిర్మాణం చేయాలి... ఎల్బీసీకి నీరు ఇవ్వాలి – జైకా నిధులు ఖర్చు చేయాలి



**మక్కువ, (రాజధాని వార్తలు):** వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు పరిధిలో శంబర గ్రామం వద్ద ఎడమ బ్రాంచ్ కాలువపై గోముఖి అక్విడెక్ట్‌ను నిర్మించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు అన్నారు. గురువారం గోముఖి అక్విడెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంబర వద్ద గోముఖి నదిపై ఆక్విడెక్ట్ కూలిపోయి 25 సంవత్సరాలు దాటిందని, ఇంత వరకు ఆక్విడెక్ట్ పూర్తి చేయకపోవడం ఘోరమన్నారు. ఆక్విడెక్ట్ పూర్తి కాకపోవడంతో మండలంలోని శంబర, తోట వలస, కవిరి పల్లి, బట్టి వలస, ఎస్. పెద్దవలస, ఫైసిల, కాకుల వాని వలస, మార్కొండ పుట్టి, మర్రి వలస, కే.పెద్ద వలస, నగళ్ళు గ్రామాలకు 4 వేల ఎకరాల భూమికి నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనులు పంట లేక, ఆదాయం రాక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే ఆక్విడెక్ట్ నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.ఆర్ఎంసి, ఆర్బిసి కాలువలు పరిధిలో చివరి ఆయకట్టు భూములు మరో ఆరు వేల ఎకరాల చివరి భూములకు సాగునీరు అందడం లేదన్నారు. జైకా నిధులు 60 కోట్ల రూపాయలు ఏమయ్యాయని ప్రశ్నించారు.వెంటనే జైకా నిధులు ఖర్చు చేసి వెంగలరాయ సాగర్ చివరి భూములు అన్నిటికీ నీరందించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘము జిల్లా కార్యదర్శి కొల్లి.గంగు నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. వై. నాయుడు పాల్గొన్నారు.

# కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

## - జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నగరంలో వాహనాలు రాకపోకలు అధికంగా పెరుగుతున్న దృష్ట్యా పలు కూడళ్ల లో ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తూర్పు జోన్ పరిధిలోని విమ్స్ హాస్పిటల్ నుండి విశాఖ వ్యాలీ స్కూల్ జంక్షన్ వరకు మరల హనుమంతు వాక జంక్షన్ వరకు తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు ముఖ్యంగా నేషనల్ హైవేలో హనుమంతు ఒక జంక్షన్ నుండి విశాఖ వ్యాలీ జంక్షన్ , పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకలు అధికంగా పెరుగుతున్నందున విపరీతంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతున్నందున ఆ ప్రాంతాలలో వాహనాలు,ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జంక్షన్లలో ఫ్రీ లెఫ్ట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. శాసన సభ్యుల సూచనలు మేరకు ఆదర్శ నగర్ ఓల్డ్ డైరీ ఫారం జంక్షన్ వద్ద ఇరువైపులా ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో నేషనల్ హైవే అథారిటీ, జీవీఎంసీ సంయుక్తంగా ఫ్రీ లెఫ్ట్ అభివృద్ధికి కార్యచరణ చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ వారితో మాట్లాడి సంయుక్త కార్యచరణ చేపట్టేందుకు సిద్ధం చేయాలన్నారు. ఆదర్శనగర్ ఇందిరా నగర్ వద్ద హైవే రోడ్డులో కాలువ నిర్మించినట్లయితే రోడ్డు వెడల్పు అవుతుందని అందువలన సర్వీస్ రోడ్డు వెడల్పు పెరిగి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని అందుకు కావలసిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విశాలాక్షి నగర్ మొదటి, రెండు రోడ్లను, కైలాసగిరి రోడ్డు తదితర ప్రాంతాలను ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటుకు కావలసిన ప్రణాళికలు యుద్ధం చేయాలని, శాసనసభ్యులు సూచన మేరకు హనుమంతవాక జంక్షన్లో విశాలాక్షి నగర్ వెళ్లే కుడివైపు ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలంలో ఆకర్షణీయంగా గ్రీనరీ, ఫౌంటైన్ ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండేటట్లు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ శాంతిరాజుకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం 9 వ వార్డు వెటర్నరీ కాలనీలో పారిశుధ్య పనులను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్వి నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ శివప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి ఆలసత్వం వహించరాదని పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి ఎప్పటి వ్యర్థాలు అప్పుడే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు వ్యర్థాల సేకరణకు క్లాప్ వాహనాలు పారిశుధ్య కార్మికులు వస్తున్నారా అని స్థానికులను ఆరా తీశారు. ప్రతిరోజు ఉదయం 5:30 నుండి పారిశుధ్య కార్మికులు విధులలో ఉండాలని, నిత్యం వారి హాజరు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, ఏ ఎం ఓ హెచ్ బి ప్రసాద్ రావు. సానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

## - గజపతినగరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## -వీధులు ఊడ్చి కలుపు మొక్కలు తీసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆయన నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి గ్రామస్తులతో కలిసి తానొక పారిశుధ్య కార్మికుడిగా మారిపోయారు. పారిశుధ్యం - పరిశుభ్రతపై కేవలం సూచనలు చేయకుండా తాను స్వయంగా చీపురు పట్టుకుని గ్రామస్తులు, అధికారులతో కలిసి వీధులు ఊడ్చి శుభ్రం చేశారు. కత్తి చేత పట్టుకుని అక్కడ పేరుకుపోయిన కలుపు మొక్కలు స్వయంగా తొలగించారు. తాను పని చేయడంతో పాటు గ్రామంలో ప్రతి ఒక్కరిని ఉత్సాహపరుస్తూ వారు కూడా పారిశుధ్య పనుల్లో పాల్గొనేలా చేశారు. వీధులు శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించి ఆ ప్రాంతం అంతా శుభ్రం చేసే వరకు మంత్రి అక్కడ నుంచి కదల్లేదు. పారిశుధ్య కార్మికులతో డ్రైనేజ్ పూడిక తీయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం, మేజర్ పంచాయతీ గజపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిమీద ఉందని తెలిపారు. పరిశుభ్రత పట్ల ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని మంత్రి గుర్తుచేశారు. పరిశుభ్రతకు ప్రభుత్వ పరంగా మేం ఎన్ని పనులు చేసినా.. ఇవన్నీ మీ పరిసరాలు.. మీరు ఇక్కడే ఉంటారు.. మీ పిల్లలు ఇక్కడే ఉంటారు.. మీరే ఎక్కువ బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులను ఉద్దేశించి మంత్రి తెలిపారు. పరిశుభ్రత ప్రజల బాధ్యత అని... చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించారు. ఓ వైపు పరిశుభ్రం చేసిన స్థలంలోనే వాటర్ బాటిల్స్ వేశారని.. ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే పారిశుధ్య కార్యక్రమాల వల్ల ప్రయోజనం ఉండదని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో పరిశుభ్రత ఒక ప్రధానాంశమని, ఇందుకోసం ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మంత్రి ఆకాంక్షించారు. మంత్రి కొండపల్లి స్వయంగా చేపట్టిన ఈ పారిశుధ్య స్ఫూర్తి కార్యక్రమం గజపతినగరం వాసుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గోపాలరాజు, గజపతినగరం మండల టీడీపీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నార్త్ జోనల్ కార్యాలయం వద్ద అమరావతి శాశ్వత రాజధాని విజయోత్సవ సంబరాలు








**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అమరావతి శాశ్వత రాజధాని బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిన నేపథ్యాన్ని పురస్క రించుకొని మాధవధారలోని జీవీఎంసీ నార్త్ జోన్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో యూసీడీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పుణ్యవతి పర్యవేక్షణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నా రాజధాని అమరావతి కార్యక్రమానికి మద్దతుగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆర్పీలు, నాయకులు, ప్రజాలు ఉత్సాహంగా పాల్గొని దీపాలను వెలిగించి అమరావతి అమర జ్యోతి కార్యక్రమం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రాజధాని అంశంపై వివిధ రంగవల్లులు వేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జయహో అమరావతి చాటుదాం ఆంధ్ర రాష్ట్ర ఖ్యాతి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సీఓలు, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలి

## - జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల అధికారులకు పిలుపు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ నిధులను సమర్థవంతంగా వినియోగించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన బడ్జెట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శాఖల వారీగా మంజూరైన బడ్జెట్ కేటాయింపులు, మండలాలు, నియోజకవర్గాల వారీగా బడ్జెట్ కేటాయింపులపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2026-2027 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ. 3,063.15 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతి శాఖ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఈ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాస్థాయి అధికారులందరూ తమ శాఖలకు కేటాయించిన బడ్జెట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, డిఆర్‌వో విజయ్‌కుమార్, సిపివో నరసింహారావు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జడ్పీ సిఇవో శ్రీధర్‌రెడ్డి, డిపివో వసుమతి, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు గంగాభవాని, హేనాసుజన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభలో అమరావతి రాజధాని బిల్లు ఆమోదం

## - ఢిల్లీలో ప్రధాని మోదీతో లోకేష్, కూటమి ఎంపీలు భేటీ





**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీతో ఏపీ మంత్రి లోకేశ్, కూటమి ఎంపీల బృందం భేటీ అయింది. లోక్సభలో అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో లోకేశ్తో పాటు ఎంపీలు ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. మోదీని శాలువాతో లోకేశ్ సత్కరించారు. ఈ సందర్భంగా కంగ్రాట్స్ అంటూ ఆయన్ను ప్రధాని అభినందించారు.

అనంతరం లోక్సభ స్పీకర్ ఓం బిర్లను కూడా లోకేశ్, ఎంపీలు కలిశారు. సభలో బిల్లు పెట్టి ఆమోదం పొందేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రగతి చారిటీస్‌కు రూ. 3 లక్షల విరాళం అందించిన విపిఆర్ దంపతులు

## - ధన్యవాదాలు తెలిపిన దివ్యాంగ చిన్నారులు, చారిటీస్ నిర్వాహకులు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని ప్రగతి ఛారిటీస్ సంస్థకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిగారు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిగారు విరాళం అందించి తమ గొప్ప మనసును చాటుకున్నారు. ప్రగతి ఛారిటీస్ సంస్థకు రూ.3 లక్షల విరాళం అందించి ఆదుకున్నారు. గురువారం ఛారిటీస్ ప్రతినిధులు పలువురు ప్రత్యేక అవసరాలున్న చిన్నారులతో కలిసి నెల్లూరులోని వి.పి.ఆర్ నివాసానికి వచ్చి ఈ చెక్కును అందుకున్నారు. అనంతరం చిన్నారులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి గులాబీ పువ్వులు అందించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. గత కొన్నేళ్ల నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతి ఏటా ప్రగతి ఛారిటీస్ నిర్వహణకు రూ.3 లక్షలు అందిస్తున్నారని, ఆయన సేవాతత్పరతకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రగతి ఛారిటీస్ సంస్థ ద్వారా నెల్లూరులో మూగ, చెముడు చిన్నారులకు చదువు అందుతోంది. అలాగే మెంటల్లీ డిజేబుల్డ్ చిన్నారుల బాగోగులు చూసుకుంటున్నట్లు ప్రతినిధులు చెప్పారు. అలాంటి చిన్నారులకు వి.పి.ఆర్ దంపతుల ఔదార్యం మరువలేనిదని వారు తెలిపారు. తాము జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.

# సంపాదకీయం

## మావిగన్.. మారీచ!

'ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెది మరో దారి' అని అంటారు. అమరావతిని మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని రాజకీయ పార్టీలూ ఏకాభిప్రాయంతో ఆమోదించగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రతిపక్ష పార్టీ వైసీపీ మాత్రం వ్యతిరేకించడం ఈ సామెతను గుర్తుచేస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన 12 ఏళ్ల తర్వాత మా రాజధాని ఇది అని అధికారికంగా చెప్పుకోవలసి రావడమే దౌర్భాగ్యం అనుకుంటే సదరు బిల్లును కూడా వ్యతిరేకించడాన్ని ఏమనుకోవాలి? పిచ్చికి మందు ఉంటుంది గానీ అసూయ, ద్వేషాలకు మందు ఉండదు. రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందుతున్న సమయంలోనే తాను మళ్లీ అధికారంలోకి వస్తే రాజధానిని మారుస్తానని ప్రకటించడంతో పాటు మచిలీపట్నం-విజయవాడ-గుంటూరును కలిపి 'మావిగన్' పేరిట రాజధానిని ఏర్పాటు చేసుకోవచ్చునని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో రాష్ట్ర ప్రజలే కాకుండా వైసీపీ నాయకులు కూడా నిర్ఘాంతపోయారు. అమరావతి అనే పేరు ఉచ్చరించడానికి కూడా జగన్‌రెడ్డి ఎందుకు ఇష్టపడటం లేదో తెలియదు. అమరావతిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి రెండు లక్షల కోట్ల రూపాయలు అవసరమని, అంత డబ్బును ఒకేచోట ఖర్చు చేస్తే మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ఆయన పాత పాటనే అందుకున్నారు. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించడం లేదు. రైతులు ఉదారంగా ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బుతోనే మౌలిక సదుపాయాలు, నిర్మాణాలు చేపడుతున్నారు. అమరావతి అనేది సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్టు అని తెలిసి కూడా గతంలో చేసిన దుష్ప్రచారాన్ని జగన్‌రెడ్డి మళ్లీ మొదలుపెట్టారు. ఇలాంటి అసంబద్ధ ఆలోచనలు, నిర్ణయాలు, చర్యల వల్ల గత ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నప్పటికీ తమ నాయకుడి వైఖరిలో మార్పు రాకపోవడాన్ని వైసీపీకి, జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న బుద్ధిజీవులు కూడా జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో జరిగిందేదో జరిగిపోయింది, ఇకనైనా రాజధాని గురించి మాట్లాడకపోవడం మంచిది అని పలువురు సలహాలు కూడా ఇస్తున్నారు. అయినా ఇవేవీ పట్టని జగన్‌రెడ్డి ఇప్పుడు మూడు రాజధానులను పక్కనపెట్టి 'మావిగన్' అనే కొత్త పేరును తెరపైకి తెచ్చారు. ఈ పేరు చెబుతున్నప్పుడు ఆయన స్వరంలో అంతులేని వెటకారం ధ్వనించింది. అమరావతి విషయంలో జగన్‌రెడ్డి వైఖరి వెల్లడి అయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అదృష్టవంతుడు అని మరోమారు రుజువైంది. జగన్‌రెడ్డి వంటి వ్యక్తి రాజకీయ ప్రత్యర్థిగా ఉండటాన్ని మించిన అదృష్టం ఏముంటుంది? 2024 ఎన్నికల్లో చంద్రబాబు బంపర్ మెజారిటీతో అధికారంలోకి రావడానికి కారణం ఏమిటి? తెలుగుదేశం-జనసేన-బీజేపీ ఒక కూటమిగా ఏర్పడటమా? లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రా? చంద్రబాబు జైలుకు వెళ్లడమా? లేక చంద్రబాబు రాజకీయ వ్యూహాలా? ఇవేవీ కావు- అప్పుడు ముఖ్యమంత్రిగా ఉండిన జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమంత్రి ఎలా వ్యవహరించకూడదో అలా వ్యవహరిస్తూ అరాచకాలను పెంచి పోషించడం ద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. 2019కి పూర్వం జగన్‌రెడ్డి ఎలాంటి వారో, ఆయన నైజం ఎటువంటిదో ప్రజలకు తెలియదు. దివంగత రాజశేఖరరెడ్డి కుమారుడిగా ఆయనను అభిమానించారు. జగన్‌రెడ్డిలో రాజశేఖరరెడ్డిని చూసుకున్నారు. ఈ కారణంగానే 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్‌రెడ్డికి కట్టబెట్టారు. ఇక అప్పటి నుంచి జగన్‌రెడ్డి నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధపడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు తత్వం బోధపడింది. ఫలితమే బంపర్ మెజారిటీతో కూటమి అధికారంలోకి వచ్చింది. సరే జరిగిపోయిందేదో జరిగిపోయింది అని ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీలు ఆత్మపరిశీలనకు ఉపక్రమిస్తాయి. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటాయి. సదరు పొరపాటు మళ్లీ జరగబోదని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తాయి. జగన్‌రెడ్డి ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా పట్టించుకోవడం లేదు. రాజకీయాల్లో అయినా, మరెందులో అయినా వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ఎదగడానికి ప్రయత్నించడం సహజం. అయితే తాను అనుకున్నదే నిజమని నమ్మే జగన్‌రెడ్డి మరో అభిప్రాయం వినడానికే ఇష్టపడరు. ఈ క్రమంలో హైహై నాయకా అనే భజనపరులే ఆయన చుట్టూ ఏర్పడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత ఆయన దృష్టికి వెళ్లకుండా పరదాలు కప్పారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ప్రజల్లో జగన్‌కు మద్దతు పెరిగిందని నమ్మబలికారు. 2019లో దాదాపు యాభై శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ బలం 55 శాతం దాటిందని తాము భ్రమించడమే కాకుండా జగన్‌రెడ్డిలోనూ భ్రమలు కల్పించారు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని కాకి లెక్కలు వేసుకున్నారు. ఈ భజన బృందం మాటలు నమ్మిన జగన్‌రెడ్డి 'వై నాట్ 175' అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత డామిట్ కథ అడ్డం తిరిగింది అని తెలిసి కూడా నెపాన్ని ఈవీఎంలపై తోసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, మూడేళ్లు కళ్లు మూసుకుంటే జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారని చిడతలు కొట్టడం మొదలెట్టారు. జగన్ పర్యటనల సందర్భంగా కృత్రిమ హడావిడికి రూపకల్పన చేస్తున్నారు.

# గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు

**- ఆరోగ్యకరమైన బిడ్డల కోసం కులాకార్ బియ్యం పంపిణీ - ఆకట్టుకున్న చేతివృత్తులు, వెదురు ఇల్లు - ప్లాస్టిక్, ఫ్లెక్సీలు లేకుండా శబల భోజనాలు**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శబల భోజనాల పండుగలో భాగంగా ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం కోసం గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం నేతృత్వంలో నిర్వహించారు. శనివారం ఉదయం సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల వద్ద సేవ్ సంస్థ, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణలో నేతృత్వంలో నాల్గవ రోజు శబల భోజనాల పండుగ నిర్వహించారు. దేశంలో ఆరోగ్యకరమైన బిడ్డల కోసం గర్భవతులకు కులాకార్ బియ్యం పంపిణీ చేశారు. అలాగే ఇక్కడ నిర్వహించిన చేతివృత్తులు, వెదురు ఇల్లు అందరినీ ఆకట్టుకున్నాయి.

ప్లాస్టిక్, ఫ్లెక్సీలు లేకుండా శబల భోజనాల పండుగ నిర్వహించడం విశేషం. మట్టి కుండలతో మంచి నీరు అందుబాటులో ఉంచారు. ప్రధానంగా ధనియాలు, సోంపు, జీలకర్ర, లవంగాలు, జాజి కాయ, యాలకులు, దాల్చినచక్క, పచ్చ కర్పూరం, వట్టి వేరు, నిమ్మకాయల రసం కలిపిన నీరు అందుబాటులో ఉంచారు. గోవర్ధన గిరి మహేష్ తీసుకు వచ్చిన దేశీయ ఆవులు చూడడానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే విత్తనాలు, ప్రకృతి ఆధారంగా పండించిన పంటలు అమ్మడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నయన, విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి, ఎసిపి మణికంఠ, ఎసిబి డిఎస్పీ హర్షిత, జిల్లా పర్యాటక శాఖ అధికారి మాధవి, జి విఎంసి సిఎం ఒ. నరేష్ కుమార్, ప్రకృతి వైనం ప్రసాద్, విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాసరావు, సర్వాయి సంస్థ శైలేంద్ర, ఎయు అల్యూమిని అసోసియేషన్ ప్రతినిధి వఫీరా, పంచగవ్య రామకృష్ణ, విద్యా వేత్త ఇంద్రాణి, యోగా గురువు ఆర్ఎంవి సత్యనారాయణ, సంకల్ప కళా గ్రామం జమీలియా తదితరులు పాల్గొని మాట్లాడారు. ప్రకృతి రైతు పిఎల్ ఎన్ రాజు, ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎంఆర్ఎన్ వర్మ, మేంగొమేన్ అప్పాజీ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కోకో అండ్ కేన్ రాజశేఖర్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్ కుటుంబ సభ్యుల వారాహి మాతకు ప్రత్యేక పూజలు



**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులు శనివారం కరప మండలం కొరుపల్లి గ్రామం పరిధిలో కాశీ వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సుభాష్ సతీమణి, ఇద్దరు పిల్లలు, ఆయన తల్లిదండ్రులు కొరుపల్లి గ్రామంలోని చిక్కాల దొరబాబు నిర్మించిన కాశీ వారాహి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. తాము కోరుకున్న ఒక ముఖ్యమైన కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో దేవికి కృతజ్ఞతగా ఆలయానికి వచ్చి పూజలు చేసినట్లు మంత్రి సుభాష్ తండ్రి సత్యం తెలిపారు. ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, అర్చకులు చెరుకూరి సుబ్బన్నలను సత్కరించి, శేషవస్త్రాలు, ప్రసాదం, పట్టుచీరలను బహుకరించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

**- మృతి చెందిన జర్నలిస్టులకు ఘనంగా నివాళులు - ఏపీలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల కోసం తీవ్ర ప్రయత్నాలు - ప్రమాద బీమా పునరుద్ధరించండి : జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధములో పలువురు జర్నలిస్టులు మృతి చెందడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. శనివారం విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు సంయుక్త కార్యవర్గసమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఎన్ఏజే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ ప్రధానకార్యదర్శి జి శ్రీనివాసరావులు మాట్లాడుతూ పచ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం వల్ల ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ధరల భారం పెరిగి ఎంతో మంది నిరుపేదలు రోడ్డున పడుతున్నారన్నారు. విధి నిర్వహణలో వీర జవాన్లతో పాటు అధికారులు అనేకమంది జర్నలిస్టులు మృతి చెందడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో మృతి చెందిన జర్నలిస్టుల పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని అలాగే వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

**ఇళ్ల స్థలాల కోసం విశ్వ ప్రయత్నాలు**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకు తక్షణమే ప్రభుత్వ పరంగా ఇళ్ల స్థలాలు ఇండ్లు కేటాయించాలని ఇందుకోసం తమ యూనియన్ పరంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు నారాయణలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతామన్నారు. అలాగే జర్నలిస్టులకు ఎంతో ఉపయోగకరమైన ప్రమాద బీమా పాలసీని పునరుద్ధరించాలని వెటరన్ జర్నలిస్టులకు జిల్లా కేంద్రాల్లో బస్సు సదుపాయం కల్పించాలని చిన్న మధ్య పత్రికలకు సంబంధించిన ఎం ప్యానల్ మెంట్ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే సమాచార శాఖ మంత్రిని కోరినట్లు వీరు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీధవళేశ్వర్ రవి కుమార్, ఉపాధ్యక్షులుపక్కి వేణు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శి ఈరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యవర్గ ప్రతినిధులు బొబ్బర ప్రసాద్, శర్మ, హరి, రవి, అప్పలనాయుడు, రమేష్, నెల రాజు, రంగ ధామం, తదితరులంతా పాల్గొన్నారు.

# రూ.5 కోట్లతో మంచినీరు చెరువు అభివృద్ధి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అల్లవరం మండలం కొమరగిరి పట్నం గ్రామ ప్రజల మంచి నీటి అవసరాలను తీర్చేందుకు రూ. 5 కోట్లతో మంచినీటి చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఉప సర్పంచ్ గుర్రం శ్రీను, కార్యవర్గ సభ్యుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ కొమరగిరి పట్నం ప్రజలు ఆదరణతోనే గెలుపొందానని ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించా మని తెలిపారు. పంచాయితీ ప్రత్యేక అధికారి మేడిద నారాయణరావు, కార్యదర్శి చిక్కం శ్రీను, ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ విజయ లక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆదరణతోనే గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. నా ఐదు సంవత్సరాల పదవి కాలంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించామని అన్నారు. త్రాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించామని తెలిపారు. కరోనా రెండు సంవత్సరాలు ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి అభివృద్ధి బాటలో నడిపించామని ఆన్నారు. కేరళ నుండి వచ్చిన బృందం రాష్ట్రంలో ఎంపిక చేసిన 24 పంచాయతీలలో ఒకటిగా కొమరగిరిపట్నం పంచాయతీ ఐఎస్ఓ సర్టిఫికెట్‌కు ఎంపిక చేసిందని ఇది ప్రజల సహకారంతో సాధించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, అల్లూరి సురేష్ రాజు, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి శ్రీనివాస్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుని శెట్టి రోహిణి కుమార్, పరసా కిరణ్ కుమార్, నిమ్మకాయల శేఖర్, దండు బుజ్జి, దాట్ల బుజ్జి రాజు, బీహెచ్ రాజు, పోచనపెద్ది పెద్ది వెంకటేష్, నల్లా రాము సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల పవిత్రతను కాపాడాలి

**- పదవికి కళంకం తెచ్చిన బి.ఆర్.నాయుడుని తొలగించాలి - చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ ప్రేక్షక పాత్ర - బిఆర్ నాయుడుని తొలగించే వరకు పోరాటం : వైఎస్ఆర్సిపి దక్షిణ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తిరుమల పవిత్రతకు కళంకం తెచ్చిపెట్టిన టిటిడి చైర్మన్ బి ఆర్ నాయుడుని ప్రభుత్వం తక్షణమే తొలగించాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు. వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్ పదవి నుండి బీర్ నాయుడును తొలగించాలని డిమాండ్ చేస్తూ దక్షణ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. 38వ వార్డు కంచర వీధిలో వెంకటేశ్వర స్వామి ఆలయం దర్శించి, పూజలు చేసిన అనంతరం గోసాల ఆస్పత్రి రాములవారి ఆలయం వద్ద జరిగిన వినూత్న కార్యక్రమంలో వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ చేతకాని కూటమి ప్రభుత్వం వల్ల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు తన పదవికి కళంకం తెచ్చే పనులు చేపడుతున్నారని ఆరోపించారు. రెడ్ హ్యాండెడ్‌గా ఒక మహిళతో ఆయన అసభ్యకర రీతిలో ఉన్న వీడియోలు బయట పడినప్పటికి కూడా ప్రభుత్వం ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. బి ఆర్ నాయుడుకు మంచి పదవి ఇవ్వాలంటే టీటీడీ చైర్మన్ పదవి నుండి తొలగించి మరొక పదవిని ఆయనకు ఇచ్చి, అతనిని నెత్తి మీద కూర్చో పెట్టుకోవచ్చని ఎద్దేవా చేశారు. ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న బిఆర్ నాయుడు పట్ల కనీస విచారణ జరగకుండా, ఆయనకు పూర్తిగా చంద్రబాబు నాయుడు



వత్తాసు పలకడం విచారకరమని పేర్కొన్నారు. ఇలా ప్రభుత్వంలో ఎవరు తప్పులు చేసినా వారిని వెనుకేసుకు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అలవాటయింది అని అన్నారు. అయితే ప్రజలు అన్ని గమనిస్తున్నారని, కచ్చితంగా వచ్చే ఎన్నికలలో తమ ఓటుతో గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమ పార్టీ అయితే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతుందన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని చెప్పారు. అలాగే టీటీడీ చైర్మన్ పదవి నుంచి బి ఆర్ నాయుడును తొలగించే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రహదారి పనులకు శంకుస్థాపన చేసిన కూటమి నేతలు



**అల్లవరం, (రాజధాని వార్తలు):** గ్రామాలలో రహదారులు, మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కూటమి నాయకులు అన్నారు. అల్లవరం పంచాయతీ పరిధిలో గొల్లల వీధి సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కూటమి నేతలు శంకుస్థాపన చేసారు. గత ప్రభుత్వ కాలంలో అధ్వానంగా మారిన గ్రామాల రహదారులను నేడు కూటమి ప్రభుత్వం నిర్మిస్తుందని అన్నారు. అల్లవరం మండల టిడిపి నాయకులు బండి గుప్తాపు సత్తిబాబు, జనసేన పార్టీ మండల నాయకులు కంకిపాటి వీరబాబు, బిజెపి మండల నాయకులు ఆత్మ డైరెక్టర్ సంకర సాయి, మాజీ సర్పంచ్ బొమ్మ బాలువేణి, సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపి నీటిసంఘం ప్రెసిడెంట్ బొక్కా ప్రసాదు, వైస్ ప్రెసిడెంట్ బండి గుప్తాపు, వీరపండు, గ్రామ కమిటీ అధ్యక్షులు మామిడిశెట్టి రాజు, బండి గుప్తాపు చిట్టివెంకన్న, కటారి. సుబ్బారావు, రాసూరి రాంబాబు, విన్న సత్యం, నిచ్చును కోళ్ల వెంకట్, వాసర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శేష్ పంచ్.. ఆ హీరో ఫీలయ్యారా?




టాలీవుడ్ యంగ్ హీరోల మధ్య పోటీ, పోలికలు ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటాయి. తాజాగా అడివి శేష్ చేసిన కొన్ని వ్యాఖ్యలు, వేసిన పంచులు హాట్ టాపిక్‌గా మారాయి. ఆయన చేసిన కామెంట్స్ వల్ల మరో యంగ్ హీరో గురించి ఊహాగానాలు మొదలయ్యాయి.

అయితే ఆ వ్యాఖ్యలతో సంబంధం లేకపోయినా, కొందరు ఓ హీరో పేరును లాగ డంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్, హీరోగా మాత్రమే కాకుండా రైటర్‌గా సినిమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న డెకాయిట్ ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఓ పోడ్ కాస్ట్‌లో పాల్గొన్న శేష్ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఓ యంగ్ హీరో గురించి చేసిన కామెంట్స్ చర్చకు దారితీశాయి. "ఓ యాక్టర్ పేరు చెప్పను. నా ప్రొడ్యూసర్ బర్త్ డే సందర్భంగా కలిశా. 'నువ్వు నా కంటే పెద్ద సినిమా చేశావు' అన్నట్టుగా షేక్ హ్యాండ్ ఇచ్చాడు. అతను చెప్పింది తెలుగులో చెబితే ఎవరో అర్థమైపోతుంది. అందుకే ఇంగ్లీష్‌లో చెబుతున్నా" అని శేష్ అన్నారు. ఆ మాటలు విన్నప్పుడు అదొక రకమైన పోలికల పోటీలా అనిపించిందని చెప్పారు. "యంగ్ హీరోల్లో టాప్ అవ్వాలనుకుంటే ముందు పెద్ద హీరోలు ఉన్నారు. వారిని దాటాలని అనుకుంటే రజనీకాంత్, చిరంజీవి లాంటి లెజెండ్స్ ఉన్నారు. వారిని మించి వెళ్లాలని అనుకుంటే షారుఖ్ ఖాన్ ఉన్నారు.

ఇంకా ఆయనకన్నా టాప్ కావాలంటే టామ్ క్రూజ్ ఉన్నారు. పోలికలు ఎక్కడికి తీసుకెళ్తాయి?" అంటూ తన అభిప్రాయం వెల్లడించారు.

# బ్లాక్ అవుట్ ఫిట్‌లో హీట్ పుట్టిస్తున్న దిశాపటాని!



అవకాశాలతో పని లేకుండా సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని పెంపొందించుకుంటూ తమ అందంతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంటున్న హీరోయిన్స్ ఈ మధ్యకాలంలో ఎక్కువే అని చెప్పాలి. ముఖ్యంగా కొంతమంది యూట్యూబ్ ద్వారా ఆదాయాన్ని ఘడిస్తుంటే.. మరికొంతమంది ఇలా ఇంస్టాగ్రామ్, ట్విట్టర్ వేదికగా అందాలు ఆరబోస్తూ ఆదాయాన్ని పెంపొందించుకుంటు న్నారు. అంతేకాదు కొన్ని బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ ఈ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ వేదికగా ఊహించని క్రేజ్ అందుకుంటున్న విషయం తెలిసిందే. ఇకపోతే కొంతమంది వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి గ్లామర్ వలకబోస్తూ సోషల్ మీడియాను పునాదిగా వేసుకుంటున్నారు. అలాంటి వారిలో ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ దిశాపటాని కూడా ఒకరు. ప్లేస్‌తో సంబంధం లేకుండా గ్లామర్ వలకబోయడమే ప్రధానంగా చేసుకుంటూ అందంతో ఆకట్టుకునే ఈ ముద్దుగుమ్మ.. తాజాగా బ్లాక్ అవుట్ ఫిట్‌లో అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులలో హీట్ పెంచే ప్రయత్నం చేసింది. అసలే సమ్మర్ పైగా బ్లాక్ డ్రెస్ ధరించి సెగలు పుట్టించే గ్లామర్ వలకబోస్తూ దిశాపటాని షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నాయి. దిశాపటాని బాలీవుడ్ నటి అయినప్పటికీ అవకాశం లభించింది మాత్రం తెలుగులోనే.. తొలిసారి లోఫర్ సినిమాతో సినిమా ఇండస్ట్రీలోకి నటిగా అడుగు పెట్టింది.. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మౌని అనే పాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించింది. అటు బాలీవుడ్‌లో ఎంఎస్ ధోని ది అన్ టోల్డ్ స్టోరీ సినిమాతో బాలీవుడ్ రంగ ప్రవేశం చేసి మొదటి సినిమాతోనే అక్కడ ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. తెలుగు, హిందీ మాత్రమే కాదు 2017లో చైనీస్ భాషలో సినిమా చేసి అలరించిన దిశాపటాని ఇక హిందీలోనే సినిమాలు చేస్తూ వచ్చింది. అటు సినిమాలతో పాటు ఇటు మ్యూజిక్ వీడియోస్‌లో కూడా కనిపించిన ఈ ముద్దుగుమ్మ .. తన చిత్రాలతో పలు అవార్డులను కూడా దక్కించుకుంది దిశా పటాని. ఇకపోతే పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఎన్నో విషయాలను పంచుకునే దిశాపటాని గతంలో తన ఫస్ట్ క్రష్ గురించి కూడా చెప్పుకు వచ్చింది.

దిశాపటాన్ని మాట్లాడుతూ.. నేను స్కూల్లో ఉన్నప్పుడు రణబీర్‌కు పెద్ద అభిమానిని. ఆయన పోస్టర్ చూస్తూ ఎన్నోసార్లు ప్రమాదంలో పడాల్సిన పరిస్థితి వచ్చింది..మా నగరంలో ఆయనకు సంబంధించిన పెద్ద పెద్ద పోస్టర్లు ఉండేవి ఇక ఆయనను చూస్తూ అలా ఉండిపోయే దాన్ని అంటూ దిశాపటాని తెలిపింది. దిశాపటాని ఇటు సిని మాలతోనే కాదు అటు వ్యక్తిగతంగా కూడా రూమర్స్ ఎదు ర్కొంటోంది. తల్వీందర్‌తో ఈమె ప్రేమలో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీనికి తోడు జనవరి 25న ఈ లోలాపలుజా ఇండియా 2026లో తల్వీందర్ చేతులు పట్టుకొని మరి బయటకు రావడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఏది ఏమైనా దిశా పటాని ఇలా వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలతో వార్తల్లో నిలుస్తోంది.

# పర భాష నటుల కామెంట్స్‌పై జేడీ ఒపీనియన్ ఇదీ!



టాలీవుడ్ ఆర్టిస్ట్‌లని విస్మరిస్తూ కొంత మంది డైరెక్టర్లు, నిర్మాతలు పరభాషలకు చెందిన నటీనటులని ఎక్కువగా తెలుగు కోసం తీసుకొస్తున్నారని, దాని వల్ల తెలుగులో ఉన్న టాలెంటెడ్ ఆర్టిస్ట్‌లకు పని లేకుండా పోతోందనే కామెంట్‌లు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. కోట శ్రీనివాసరావు లాంటి నటులు బాహాటంటానే దీనిపై కామెంట్‌లు చేశారు. ప్రకాష్ రాజ్‌లాంటి పరభాష నటులని ప్రోత్సహిస్తున్నారని, ఇది మంచి పద్దతి కాదని విమర్శలు గుప్పించారు. తాజాగా ఇదే తరహా ప్రశ్న జెడీ చక్రవర్తికి ఎదురైతే ఆయన ఆసక్తికరంగా స్పందించారు. చాలా కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్న జెడీ చక్రవర్తి తెలుగులో తరుణ్ భాస్కర్ కథానాయకుడిగా నటించిన గాయపడ్డ సింహంలో నటించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జేడీ చక్నవర్తి పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు ఆర్టిస్ట్‌లను పక్కన పెట్టి పరభాష నటులను తీసుకుంటున్నారు అన్నది కరెక్ట్ కాదు. మాలాంటి నటులను ముందుగా అప్రోచ్ అయినా మాలాంటి వాళ్లు కొన్ని సార్లు నో చెప్పడం వలన వేరే భాష నటులకు వెళ్లివుండవచ్చు అన్నారు. లేదా కొన్ని సందర్భాలలో ఆ క్యారెక్టర్‌కు వాళ్లు మాత్రమే సరిపోతారని భావించి దర్శకుడు తీసుకున్న నిర్ణయం కూడా అయివుండోచ్చు. అంతే కానీ మన తెలుగువాళ్లని పక్కన పెట్టి పరభాష నటుల కోసం వెళుతున్నారు అనేది కరెక్ట్ కాదు. క్యారెక్టర్ ఫిట్‌నెస్ అనేది ఒకటి ఉంటుంది. కొన్ని క్యారెక్టర్లకు దర్శకుడు ఎవరిని అనుకుంటున్నారో వాళ్లే సరిపోతారు అన్నారు. ఇదే సందర్భంగా థియేటర్స్‌ని టెంపుల్స్ అంటారు కదా? దీనిపై మీ ఒపీనియన్ అని అడిగితే తనదైన శైలిలో స్పందించారు. థియేటర్ టెంపుల్ అయితే మీరు స్నానం చేసే థియేటర్స్‌కు వెళుతున్నారా?..గాళ్ ఫ్రెండ్‌తో పక్కన కూర్చుని సినిమా చూస్తున్నారా? ..టెంపుల్‌లో ఇవన్నీ చేస్తారా ఎవరైనా? థియేటర్ అనేది ఒక క్రియేటివ్ ప్లేస్. అక్కడికి వెళ్లి ఎంటర్‌టైన్ అవ్వాలనుకుంటారు. టెంపుల్‌కి ఎంటర్‌టైన్‌మెంట్‌కి వెళతామా? ఇది ఏంటంటే చెప్పుకోవడానికి బాగుంటాయిని కాయినింగ్ చేస్తుంటారు. ఆ సౌండింగ్ నచ్చి మిగతావాళ్లు ఫాలో అవుతారు అంటూ సెటైర్లు వేశారు. జెడీ చక్రవర్తి వేసిన సెటైర్లు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# అలా మాట్లాడితే జాన్వీకి కోపం వస్తుందట..!



బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా దేశంలోని అన్ని భాషల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసి, అభిమాన హీరోయిన్‌గా నిలిచిన అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా జాన్వీ కపూర్ ఎంట్రీ ఇచ్చింది. శ్రీదేవికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరూ హీరోయిన్స్‌గానే ఇండస్ట్రీలో ఉన్నారు. అయినా కూడా అంతా జాన్వీ కపూర్ గురించి మాట్లాడుకుంటారు. అందుకు కారణం ఆమె అందం, ఆమె సోషల్ మీడియా పోస్ట్‌లు అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినా కమర్షియల్ బ్రేక్ దక్కించుకోలేక పోయిన జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా వార్తల్లో నిలుస్తుంది. దాంతో హీరోయిన్‌గా ఆఫర్లను దక్కించుకుంటూ ఉంటుంది. జాన్వీ కపూర్ గురించి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలో ఎక్కువగా ఉంటుంది అనే విమర్శ ఉంది. అయినా పట్టించుకోకుండా జాన్వీ కపూర్ తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది. జాన్వీ కపూర్ ఫోటోలు రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తన ఫోటో షూట్ ఫోటోలను జాన్వీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడం లేదంటే, ఏదైనా కార్యక్రమంకు వెళ్లిన సమయంలో మీడియా ఫోటోగ్రాఫర్లకు ఫోజ్‌లు ఇవ్వడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. జాన్వీ కపూర్ ఎక్కువగా పాపరాజీల దృష్టిని ఆకర్షించే విధంగా ఔట్ ఫిట్‌ను ధరిస్తుంది అనే టాక్ కూడా ఉంది. గతంలో పలు సార్లు పాపరాజీల గురించి పాజిటివ్‌గా మాట్లాడిన జాన్వీ కపూర్ తాజాగా ఒక చిట్ చాట్ సందర్భంగా వారు అప్పుడప్పుడు చేసే వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసింది. సందర్భానుసారంగా తాను ధరించిన డ్రెస్‌ను పాపరాజీలు ఇష్టానుసారంగా ఫోటోలు తీసుకుని, అందంగా లేదు అంటూ కామెంట్ చేయడంపై ఆమె తాజా చిట్ చాట్‌లో స్పందించింది. తన ఫోటోలను కొన్ని యాంగిల్స్‌లో చూసి పాపరాజీలు, నెటిజన్స్ 'ఈమె హాట్‌గా లేదు, అందంగా లేదు' అంటూ కామెంట్ చేయడం వంటివి చేస్తే కోపం వస్తుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. తన గురించి ఇతరులు మాట్లాడుకోవడం పర్వాలేదు కానీ, తన గురించి పదే పదే నెగిటివ్‌గా మాట్లాడుకోవడం కోపం తెప్పిస్తుందని జాన్వీ కపూర్ అంది. తాను ఎన్నో ఫోటో షూట్స్‌లో హాట్‌గా అందంగా కనిపించాను. కొన్ని ఫోటోలను యాంగిల్ లేకుండా తీసి, ఇష్టానుసారంగా పోస్ట్ చేసిన పాపరాజీల ఫోటోలను చూసి కొందరు హాట్‌గా లేదని వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు అన్నట్లుగా జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది. కంఫర్ట్ లేకుండా రకరకాల యాంగిల్స్ నుంచి ఫోటోలు తీయడం అనేది ఇబ్బందిగా అనిపిస్తుంది. ఆ ఫోటోలను వారు హాట్‌గా లేదని కామెంట్ పెట్టి పోస్ట్ చేయడంను జాన్వీ కపూర్ తప్పుబట్టింది. జాన్వీ కపూర్ గత ఏడాది మూడు హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ మూడు సినిమాలు సైతం తీవ్రంగా నిరాశ పరిచాయి. గత ఏడాది జాన్వీ కపూర్‌కి శృంగార తారగా మరింత గుర్తింపు దక్కింది. కానీ ఎప్పటిలాగే హిట్ మాత్రం దక్కలేదు. కానీ జాన్వీ కపూర్ ఈ ఏడాది పై చాలా ఆశలు పెట్టుకుంది. ఒకటి రెండు బాలీవుడ్ సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి.

మరోవైపు రామ్‌చరణ్‌తో నటించిన పెద్ది సినిమా విడుదలకు ముస్తాబు అవుతుంది. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉండబోతున్నట్లుగా ఇప్పటి వరకు విడుదలైన పాటలను బట్టి అర్థం అవుతుంది. ఇప్పటికే జాన్వీ కపూర్ లుక్‌కి, ఆమె యొక్క బాడీ లాంగ్వేజ్‌కి మంచి స్పందన వచ్చింది. సినిమా హిట్ అయితే జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా, అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్‌గా మారే అవకాశం ఉంది. మరో వైపు బాలీవుడ్ లోనూ ఈమె బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** లోక్‌సభలోనూ, రాజ్యసభలోనూ అమరావతిని రాజధానిగా గుర్తించే బిల్లు ఆమోదం పొందడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మిత్రులకు, మీడియా ప్రతినిధులకు ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు, వారితో పాటు రాజధాని వార్తలు ఎడిటర్ హుస్సేన్ ఖాన్ పాల్గొన్నారు. అమరావతి రైతుల త్యాగాన్ని, ప్రజల ఆకాంక్షను గుర్తు చేస్తూ, "ఇది అందరి విజయం" అని ఆయన వ్యాఖ్యానించారు.

# గుంటూరు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్

**- మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో బడ్జెట్ అవుట్ రీచ్ ఈవెంట్ - 2026-27**
**- నియోజకవర్గాల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ - ఈ నెల 11న జరిగే ముఖ్యమంత్రి సమీక్షా సమావేశానికి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం**




**గుంటూరు, (రాజధాని వార్తలు):** గుంటూరు జిల్లాను సర్వతో ముఖాభివృద్ధి పథంలో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని శంకరన్ కమిటీ హాల్‌లో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన "బడ్జెట్ అవుట్ రీచ్ ఈవెంట్ – 2026–27" నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి: రాష్ట్ర బడ్జెట్ ఆమోదం పొందిన నేపథ్యంలో ప్రతి జిల్లా మరియు నియోజకవర్గ స్థాయి వరకు బడ్జెట్ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని మంత్రి దుర్గేష్ తెలిపారు. స్థానిక అవసరాలు, రంగాల వారీ ప్రాధాన్యతలను బట్టి నిధుల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. సమీక్షా సమావేశం: ఈనెల 11వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధిపై జరగనున్న సమీక్షా సమావేశానికి ముందే ప్రజాప్రతినిధులు మరియు అధికారులు తమ పరిధిలోని ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై పూర్తి స్పష్టతతో ఉండాలని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. తొలుత 7వ తేదీన సమీక్షా సమావేశం అనుకున్నప్పటికీ 11కి వాయిదా పడిందన్నారు. అధికారులకు దిశానిర్దేశం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మకు అభినందనలు తెలుపుతూ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. శాఖల వారీగా, మండలాల వారీగా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే కార్యక్రమాలు: ప్రభుత్వ లక్ష్యాలను, బడ్జెట్ కేటాయింపులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అందరం కలిసికట్టుగా జిల్లాను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ముందుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమ ప్రాంతాల్లోని సమస్యలను మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకు రాగా వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీనిస్తూ తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గల్లా మాధవి, నజీర్ అహ్మద్, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎస్.ఎస్.కె. ఖాజావలి, నగర కమిషనర్ మయూర్ అశోక్ మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక సమస్యలతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు ఆంధ్ర ఉపాధ్యాయ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలోని రాష్ట్రంలోని ఎమ్మెల్యే గృహంలో అందరు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్పకు ఆంధ్ర ఉపాధ్యాయ సంఘం కాకినాడ జిల్లా శాఖ తరపున వినతిపత్రం నాయకులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపియుఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ ఎస్ వి చలపతి, సిహెచ్ ఎన్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి టివివి సత్యనారాయణ, సామర్లకోట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేదాద్రి శ్రీనివాస్, నూకిరెడ్డి, పెద్దాపు రం మండల ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రరావు పాల్గొన్నారు.

# ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చేది కలే : భాను ప్రకాశ్ రెడ్డి



**న్యూఢిల్లీ :** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఓ విధంగా.. ఓడిపోయిన తర్వాత మరో విధంగా ఉండే వ్యక్తి జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు గెలుపు ఓటములు సర్వసాధారణమన్నారు. వైసీపీని ఏపీ ప్రజలు ఛీదరించుకున్నారని.. ఓడిపోయిన తర్వాత రాష్ట్రంపై జగన్ ద్వేషం పెంచుకున్నారని అన్నారు. బంగారు పంటలు పండే భూములను రైతులు.. రాష్ట్ర ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. అలాంటి రైతుల కళ్లల్లో కన్నీళ్లు పెట్టించి జైల్లో వేసి జగన్ రాక్షసానందం పొందారని విమర్శించారు. ఏపీని అభివృద్ధి ప్రదేశ్‌గా ఎన్డీఏ కూటమి ముందుకు తీసుకెళ్తోందని భాను ప్రకాశ్ వెల్లడించారు. పార్లమంట్ ఉభయ సభల్లో అమరావతి బిల్లుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆమోదం తెలిపారని.. దాన్ని ఓర్వలేక జగన్ 'మావిగన్' అని వ్యాఖ్యలు చేస్తున్నా రని మండిపడ్డారు. ప్రజలు 2024లో ఓటు అనే గన్ ఆయుధంతో వైసీపీని పేల్చితే.. 164 సీట్లలో పిట్టలుగా లేచిపోయారని.. కేవలం 11 సీట్లు మాత్రం వచ్చాయని అన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు 11 సీట్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రశాంత వాతావరణంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ చేష్టలను ఏపీ ప్రజలు ఛీదరించుకుంటున్నారని భాను ప్రకాశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఒకటే రాజధాని అది అమరావతి అని తేల్చిచెప్పారు. మళ్లీ జగన్ అధికారంలోకి వచ్చేది లేదు.. చూసేది లేదన్నారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చేది ఒక కల మాత్రమే అని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఒక కామెడీ యాక్టర్‌గా మిగిలిపోయారని.. ఆ వీడియోలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. మాజీ సీఎం అపరిచితుడిగా మారిపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో వెళుతోందన్నారు. 2019లో వైసీపీ ఏపీని అప్పుల ప్రదేశ్‌గా మార్చిందని భానుప్రకాశ్ విరుచుకుపడ్డారు. జగన్, వైసీపీకి ఏపీ ప్రజలు విడాకులు ఇచ్చారన్నారు. అమరావతి రైతుల శాపం జగన్‌కు తగిలిందన్నారు. ఏపీలో వైసీపీ ఫ్యాన్ తిరగదని.. కామెడీలతో జగన్ శేష జీవితం పూర్తవుతుందని అన్నారు. భూమన కరుణాకర్ రెడ్డికి చేతనైతే జగన్ చేతిలో భగవద్గీత పెట్టాలని సవాల్ విసిరారు. ఇంట్లో దేవాలయాల సెట్లు వేసుకుని.. కనీసం తీర్థం కూడా తీసుకోరంటూ జగన్‌పై భానుప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



## గుంటూరు జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన శాసన సభ్యులు రామాంజనేయులు, నరేంద్ర కుమార్, గల్లా మాధవి

# పీఎం ఇంటర్న్‌షిప్‌తో ప్రతిష్టాత్మక సంస్థలలో శిక్షణ

**- ఏప్రిల్ 21వ తేదీలోగా వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**



**గుంటూరు, (రాజధాని వార్తలు):** పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమంతో ప్రతిష్టాత్మక సంస్థలలో యువతకు వృత్తిపరమైన శిక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. 'పీఎం ఇంటర్న్‌షిప్' కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ యువతకు ప్రతిష్టాత్మక సంస్థలలో వృత్తిపరమైన శిక్షణ అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'పీఎం ఇంటర్న్‌షిప్' పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి, వారికి కార్పొరేట్ రంగంలో పని అనుభవాన్ని కల్పించడానికి ఈ పథకం ఒక గొప్ప వేదిక అని కొనియాడారు. జిల్లాలోని అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద 18 నుండి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువత దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్ అధికారిక పోర్టల్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఎంపికైన వారికి 6 నుండి 9 నెలల పాటు దేశంలోని అగ్రశ్రేణి కంపెనీలలో శిక్షణ లభిస్తుందని తెలిపారు. దేశంలోని టాప్–500 కంపెనీలలో యువతకు 6 నుండి 9 నెలల పాటు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరచడం, ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో నెలకు రూ. 9 వేల ఆర్థిక ప్రోత్సాహకం అందించడం పథకం ముఖ్య ఉద్దేశ్యాలు అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండ సంజీవరావు మాట్లాడుతూ ఈ పథకం క్రింద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి పదవ తరగతి, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ, బీటెక్ విద్యార్హత ఉన్నవారు ఎవరైనా అర్హులన్నారు. అభ్యర్థులు https://pminternship.mca.gov.in/login/ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి ఆరు వేల రూపాయలు వన్ – టైమ్ గ్రాంట్ మరియు భారత ప్రభుత్వం ద్వారా నెలవారీ సహాయం రూ. 8,100 మరియు పరిశ్రమలు ద్వారా 9 వందల రూపాయలు వెరసి తొమ్మిది వేల రూపాయలు సంవత్సరం పాటు అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉందన్నారు. ఇప్పటికే ఉన్న పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు ఏ.పీ.ఎస్.ఎస్.డి.సి కమాండ్ కంట్రోల్ : +91- 998853335, 8712655686, 8790118349, 8790117279, మరియు స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ జి.వి. ఎస్. సాయి కుమార్ 8074607278 నంబర్‌కు సంప్రదించవచ్చున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేసే వారి కుటుంబ సభ్యులు, వార్షిక ఆదాయం రూ.12 లక్షలు దాటిన వారి కుటుంబ సభ్యులు,హొహొఉన్నత విద్యా సంస్థల్లో గ్రాడ్యుయేషన్ చేసిన వారు అనర్హులని వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

# విజయవాడలో ఏఐ సమ్మిట్‌ను ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర




**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడలో ఏఐ సమ్మిట్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఈ ఏఐ సమ్మిట్ జరిగింది. ప్రపంచాన్ని టెక్నాలజీ నడిపిస్తోందని 25 ఏళ్ల క్రితమే చంద్రబాబు చెప్పారని మంత్రి అన్నారు. గత 2014లోనే చంద్రబాబు డేటా సెంటర్లు, ఏఐ అంటే మాకు అర్థం కాలేదని కొల్లు రవీంద్ర గుర్తు చేసుకున్నారు. అయితే ఇప్పుడు ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా తెలుగువాళ్లే ఉన్నారని కొనియాడారు. సాంకేతిక అభివృద్ధికి 27 పాలసీలు తీసుకున్నామని ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. గతంలో వెనక్కి వెళ్లిపోయిన సాఫ్ట్‌వేర్ సంస్థలను మళ్లీ తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రానికి అనేక డేటా సెంటర్లు వస్తున్నాయని, రాష్ట్రంలో పోర్టుల నిర్మాణం సైతం వేగంగా జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్వర్క్ ఏపీడీటీఐ ఛైర్మెన్ శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో అన్ని రంగాల్లో వస్తున్న మార్పులు, పరిశ్రమల్లో ఏఐ ను ఎలా వినియోగిస్తున్నారు, ఉద్యోగ సాధన కోసం, ఐటీ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎటువంటి నైపుణ్యాలు పెంపొందించుకోవాలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్పొరేట్ రంగంలో ఏఐ ద్వారా ఎలా పనిచేయాలనేది ఇండస్ట్రీ హెడ్స్ వివరిస్తారని, విద్యార్థులు, యువతకు ఇది సువర్ణావకాశం అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అన్ని రంగాలలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. ఐటి ఇండస్ట్రీపై ఎక్కువ ప్రభావం పడిందన్నారు.

రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని చెప్పారు. భారత దేశంలో ఐటి రంగంలో 80 లక్షల మంది పనిచేస్తున్నారని, ప్రతి కుటుంబం నుంచి ఐటిలో ఉన్నారని, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. కొత్తగా వస్తున్న పరిజ్ఞానం కారణంగా ఐటి పరిశ్రమకు కోడింగ్ చేసే వారు ఇంకా అవసరం లేదని, డెవలపర్స్, కోడర్స్ అవసరం పరిశ్రమకు లేదన్నారు. అదంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చూడబోతోందని తెలిపారు. డొమైన్ కీ పాయింట్ కాబోతోందని చెప్పారు. డొమైన్ మీద పట్టు ఉంటె ఐటి, ఏఐ వాడుకొని ఉద్యోగాల్లో రాణించవచ్చని తెలిపారు. ఐటి, ఏఐ మీద జాబ్స్ ఎక్కువ అవుతాయి కానీ డొమైన్ కనెక్ట్ చేసుకుంటేనే ఉద్యోగాలు ఉంటాయన్నారు. స్టార్ట్ అప్ కంపెనీస్ ప్రతినిధులు, పరిశ్రమలు నడుపుతున్న వారు తమ వ్యాపారాలను ఎలా ఏఐ ఎనేబుల్డ్ సర్వీసెస్గా మార్చుకోవాలో వివిధ రంగాలలోని నిపుణులు తెలియచేశారన్నారు.

# ‘కోవిడ్ ఫైటర్స్’కు వాహనాన్ని బహూకరించిన అరుణ్ కుమార్



**గుంటూరు, (రాజధాని వార్తలు):** శుభకార్యాలలో మిగిలిన ఆహారాన్ని సేకరించి అన్నార్థులకు పంచి పెట్టేందుకు వీలుగా 5 లక్షలకు పైగా విలువైన ఓ నూతన వాహనాన్ని కోవిడ్ ఫైటర్స్ బృంద సభ్యులకు ప్రముఖ వ్యాపారవేత్త, సేవా తత్పరులు త్రిపురమల్లు అరుణ్ కుమార్ బహూకరించారు. ఈనెల 4వ తేదీన గుంటూరులోని అంకమ్మ నగర్ నందు గల కోవిడ్ ఫైటర్స్ మహిళా సాధికారత కేంద్రం వద్ద జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించిన వాహన ప్రారంభోత్సవ సభలో స్వచ్ఛంద మరియు పౌర సంస్థల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. వాహన దాత అరుణ్ కుమార్ ప్రసంగిస్తూ భగవంతుడు ఇచ్చిన దాంట్లో కొంచెం పేదలకు పంచి పెట్టడం ధర్మం అని, సమాజంలో పేదవాళ్లకు సేవ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు సాయం అందించాలని పిలుపునిచ్చారు. పలు స్వచ్ఛంద సంస్థలు విడివిడిగా పనిచేస్తున్నప్పటికీ సేవే లక్ష్యంగా కృషి జరుపుతున్నాయని, సేవారంగంలో ఆలోచనల పరిధి పెంచుకుంటూ కోవిడ్ ఫైటర్స్ అద్భుతాలు చేస్తుందని కితాబిచ్చారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అన్నార్థుల ఆకలి తీర్చడం, అనాధలకు అంతిమ సంస్కారాలు నిర్వహించడం, మహిళలకు కుట్టు మిషన్ల ద్వారా శిక్షణ ఇప్పించటం లాంటి బహుముఖ సేవా కార్యక్రమాలను కోవిడ్ ఫైటర్స్ నిర్వహిస్తుందని, ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని వృధాగా పోకుండా ఉండేందుకు ఈ వాహనం దోహదపడుతుందని పేర్కొన్నారు. నగరంలో గల స్వచ్ఛంద సేవా సంస్థలన్నింటినీ ఏకత్రాటిపైకి తీసుకొచ్చి ఓ వేదిక ఏర్పాటు చేయగలిగితే సాయం అందించేందుకు పలు దాతలు సిద్ధంగా ఉన్నారని, ఆ దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు, బిపి మండల్ సేన చైర్మన్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ బాధ్యతలు భుజాన ఎత్తుకునే వయసులో నిస్వార్థంగా సమాజానికి సేవ చేస్తున్న కోవిడ్ ఫైటర్స్ అభినందనీయులని, ప్రతి ఒక్కరూ మానవసేవనే మాధవ సేవగా భావించి సమాజ అభివృద్ధికై తోడ్పడాలని పేర్కొన్నారు. హీల్ స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి ప్రసంగిస్తూ యువత సేవా కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమని, అనాధలను అక్కున చేర్చుకొని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమ సంస్థ కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. కిద్మత్ మ్యూచువల్లీ ఎయిడెడ్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ కోశాధికారి షేక్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ద్వారానే సమాజానికి భద్రత చేకూరుతుందని, సేవ చేస్తున్న వాళ్లను గుర్తు చేసుకుంటూ ప్రేరణ పొందాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోవిడ్ ఫైటర్స్ కు ఆహార పాత్రలను సమకూర్చుకునేందుకు గాను 50 వేల రూపాయల ఆర్థిక విరాళాన్ని అందజేయనున్నట్టు ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ పోలూరి వీరారెడ్డి పేర్కొన్నారు. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లా బక్షు ప్రసంగిస్తూ వివిధ సందర్భాలలో మిగిలిన అన్నాన్ని సేకరించే కార్యక్రమం 2022లో ప్రారంభించి నేటికీ 11 లక్షల మందికి భోజనాలు అందించ గలిగామన్నారు. కోవిడ్ సమయంలో 2500 మందికి దహన సంస్కారాలు చేశామని, నేటికీ 6 వేల మందికి దహన సంస్కారాలు కోవిడ్ ఫైటర్స్ చేశామని అన్నారు. 40 మంది యువ ముస్లింలతో ప్రారంభమైన కోవిడ్ ఫైటర్స్ గత 6 సంవత్సరాలుగా బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. మహిళా సాధికారతను పెంపొందించే లక్ష్యంతో ప్రారంభమైన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో 180 మంది మహిళలు కుట్టు మిషన్ లో శిక్షణ పొందినారన్నారు. వివిధ సందర్భాలలో మిగిలిపోయిన అన్నాన్ని అందించడానికి 8143222456 మరియు 9397602553 నంబర్లకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ పావులూరి రమేష్, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామచంద్రరాజు, చేయూత ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు టి.ధనుంజయ రెడ్డి, వి ఆర్ విత్ యు చైర్మన్ సిగినం అయ్యప్ప, సన్ వ్యవస్థాపకులు కళ్యాణం యశ్వంత్, అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్ ఎం రామాంజనేయులు, టోపీ బాబు, పఠాన్ ముజీబ్, పఠాన్ హుస్సేన్, పెరుమాళ్ళ శిరీష, కనపర్తి రాఘవ రావు, బత్తుల కోటేశ్వరరావు, అభినందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు కట్ట నిర్మల కుమార్, కె.బి.ఆర్. ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.బాలరాజు, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కె.వి.చలపతిరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. తొలుత అతిథుల సమక్షంలో నూతన వాహనాన్ని ప్రముఖ వ్యాపారవేత్త త్రిపురమల్లు అరుణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.

# రాజధానిపై జగన్ విధ్వంసం...అమరావతిపై చంద్రబాబు విజయం

**- అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి రాష్ట్ర అభివృద్ధి - జగన్ విధ్వంసానికి చెక్...అమరావతి జయభేరి**
**- పార్లమెంట్‌లో 50కి పైగా పార్టీల మద్దతు... వైసీపీ వాకౌట్ షాక్ - అభివృద్ధి చేసిన చంద్రబాబు... అడ్డుకున్న జగన్ - మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల్లో చిచ్చు - విశ్వసనీయతపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు - జగన్‌పై విరుచుకుపడ్డ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి/మంగళగిరి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు చూస్తే జగన్ పాలన పూర్తిగా విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి పునర్నిర్మాణం విజయపథంలో దూసుకెళ్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వం బాధ్యత అని, గత వారం రోజులుగా 5 కోట్ల మంది ప్రజలు ఆనందోత్సవాలతో పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో పార్లమెంట్, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య రామమందిరం, జూూా, వక్ఫ్ బిల్లు సవరణ, మతమార్పిడి వ్యతిరేక చట్టాలు వంటి అనేక అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విభేదాలు వచ్చినా ఎక్కడా ఏకాభిప్రాయం రాలేదని అన్నారు. అయితే అమరావతి చట్టబద్ధత విషయంలో దేశంలోని 50కి పైగా రాజకీయ పార్టీలు మద్దతు తెలపగా కేవలం వైసీపీ మాత్రమే వ్యతిరేకించి పార్లమెంట్‌లో వాకౌట్ చేసిందని విమర్శించారు. తెలుగు జాతి రాజధాని అమరావతిపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న కక్ష చరిత్ర చూస్తే అర్థమవుతుందని, చంద్రబాబు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా 5 కోట్ల మంది ఆంధ్రుల అభివృద్ధినే దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం జరగకుండా చివరి నిమిషం వరకు పోరాడిన నాయకుడు చంద్రబాబేనని గుర్తుచేసి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని విడదీసి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాంతాలు, వర్గాల మధ్య విభేదాలు రాకుండా అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకొచ్చి, హైదరాబాద్‌లో 13 గంటల పాటు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి అందరి అభిప్రాయంతోనే అమరావతిని రాజధానిగా ప్రకటించారని తెలిపారు. ఆ సమయంలో వైసీపీ కూడా అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపిందని, “ఇక్కడే ఇల్లు కట్టుకుంటాను, రాజధానిని మార్చను” అన్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చి అమరావతిని శ్మశానం, ఎడారి అంటూ దూషించారని, ఒక జాతి, కులంపై నీచ వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. అమరావతిలో అవినీతి జరిగిందని ఆరోపించినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని, రాజధాని విషయంలో తొమ్మిది సార్లు మాట మార్చారని విమర్శించారు. అమరావతిని నమ్మి 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని, ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ కావడంతో ప్రభుత్వ ఖజానా నుంచి రూపాయి ఖర్చు అవసరం లేదన్నారు. 2014-2019 మధ్య టీడీపీ హయాంలో 54 వేల కోట్లతో ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేశామని, కానీ 2019లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి అభివృద్ధిని పాతరేసారని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 18 నెలల్లోనే జగన్ చేసిన విధ్వంసాన్ని సరిచేసే పనులు ప్రారంభించి అమరావతి అభివృద్ధి, భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్ నిర్మాణం, కొత్త పెట్టుబడులు తీసుకువస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్‌ను 18 నెలల్లో పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేస్తామని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను 13 వేల కోట్లతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. రాయలసీమలో లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిపోయిందని అబద్ధాలు చెప్పిన వైసీపీని తప్పుబట్టి, 18 నెలల్లోనే సీమలో 2,200 కోట్లతో పనులు చేపట్టి కుప్పం వరకు నీరు తీసుకు వచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజల ఆనందాన్ని చెడగొట్టేందుకు “మావిగన్” అనే కొత్త నాటకంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, జగన్‌కు వైసీపీలోనే మద్దతు లేదని, ప్రజలు ప్రశ్నిస్తే రాజకీయాల్లో ఉండలేరని హెచ్చరించారు. అమరావతి తెలుగు ప్రజల భవిష్యత్తు అని స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు, అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

# ఏఐఐఎంఎస్ మంగళగిరి అధునాతన ఎన్ఏఏటి, స్వయంచాలక టిటిఐ స్క్రీనింగ్ ప్రారంభం









**మంగళగిరి, (రాజధాని వార్తలు):** సురక్షిత రక్త మార్పిడి కోసం AIIMS మంగళగిరి అధునాతన NAAT మరియు స్వయంచాలక TTI స్క్రీనింగ్‌ను ప్రవేశపెట్టింది. రక్తమార్పిడి భద్రతను మరియు రోగి సంరక్షణను మెరుగుపరిచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ, ఎయిమ్స్ మంగళగిరి గౌరవ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & CEO, ప్రొఫెసర్ (డా.) అహంతేమ్ శాంతా సింగ్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ మరియు హెమోథెరపీ విభాగంలో న్యూక్లిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్టింగ్ సిస్టమ్‌తో పాటు అధునాతన ఆటోమేటెడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ట్రాన్స్‌మిసిబుల్ ఇన్ఫెక్షన్స్ స్క్రీనింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ (డా.) రాజశేఖర్ మోహన్; డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన) కల్నల్ శశికాంత్ తుమ్మ; ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ మరియు హెమోథెరపీ విభాగం అదనపు ప్రొఫెసర్ & హెడ్ డా. ఐ.ఎస్. చైతన్య కుమార్; మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అనిలా మణి హాజరయ్యారు. “ఈ అధునాతన వ్యవస్థల ఏకీకరణ వల్ల, ముఖ్యంగా క్లిష్టమైన మరియు అత్యవసర సంరక్షణ పరిస్థితులలో, అతి తక్కువ సమయంలో అత్యంత సురక్షితమైన రక్తం అందుబాటులోకి వచ్చేలా చూడటం ద్వారా ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాలలోని రోగులకు ఇది ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుంది,” అని డైరెక్టర్ అన్నారు. సుమారు 1.73 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయబడిన NAAT వ్యవస్థ, రక్త పరీక్షల సాంకేతికతలో ఒక అత్యాధునిక పురోగతిని సూచిస్తుంది. ఇది వైరల్ RNA/DNAను గుర్తించగలదు, తద్వారా HIV, హెపటైటిస్ బీ మరియు హెపటైటిస్ సి వంటి ఇన్ఫెక్షన్లను ముందుగానే గుర్తించడానికి వీలు కల్పిస్తుంది, దీనివల్ల వ్యాధిని గుర్తించడానికి పట్టే సమయం గణనీయంగా తగ్గుతుంది. ఆటోమేటెడ్ TTI స్క్రీనింగ్ సిస్టమ్‌తో కలిపి ఉపయోగించినప్పుడు, ఇది రెట్టింపు భద్రతను అందిస్తుంది. ఇది రక్తమార్పిడి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గించడంతో పాటు, రోగులకు సురక్షితమైన రక్తం మరియు రక్త భాగాలను కూడా అందిస్తుంది. ఈ ఏర్పాటు రక్తమార్పిడి భద్రత దిశగా ఒక ప్రధాన ముందడుగు, ఎందుకంటే ఇది: దక్షిణ భారతదేశంలోని అన్ని ఎయిమ్స్ సంస్థలలో ఇటువంటి వాటిలో మొట్టమొదటిది. ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యక్తిగత దాత NAAT పరీక్షను అమలు చేసిన మొట్టమొదటిసారి. దీనికి ముందు, ఎయిమ్స్ మంగళగిరి రక్త కేంద్రం 4వ తరం కిట్‌లను ఉపయోగించి మాన్యువల్ ELISA-ఆధారిత పరీక్షపై ఆధారపడింది, దీని ఫలితాల వెల్లడికి 5-8 గంటల సమయం పట్టేది. ఆటోమేటెడ్ TTI స్క్రీనింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో, పరీక్ష ఫలితాలు వెలువడే సమయం సుమారు 30 నిమిషాలకు గణనీయంగా తగ్గింది. దీనివల్ల, ముఖ్యంగా అత్యవసర పరిస్థితులలో మరియు అరుదైన రక్త సమూహాలు ఉన్న రోగులకు సురక్షితమైన రక్తం వేగంగా అందుబాటులోకి వస్తుంది. NAAT వ్యవస్థ, రోగ నిర్ధారణకు పట్టే సమయాన్ని (ప్రస్తుతం హెచ్ఐవికి సుమారు 2-3 రోజులు, హెపటైటిస్ బికి దాదాపు 10 రోజులు, మరియు హెపటైటిస్ సికి సుమారు 1 రోజుగా అంచనా వేయబడింది) గణనీయంగా తగ్గించడం ద్వారా భద్రతను మరింత మెరుగుపరుస్తుంది.

దీనివల్ల, సాధారణంగా ఉపయోగించే పద్ధతులతో పోలిస్తే వ్యాధిని ముందుగానే గుర్తించడం సాధ్యమవుతుంది. ఈ సందర్భంగా గౌరవనీయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ, రక్తమార్పిడి భద్రతలో అత్యున్నత ప్రమాణాలను నిర్ధారించడంలో, ప్రమాదాలను తగ్గించడంలో, మరియు రోగి ఫలితాలను మెరుగుపరచడంలో ఈ అధునాతన సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి అత్యాధునిక సాంకేతికతలను అవలంబించాలనే ఎయిమ్స్ మంగళగిరి నిబద్ధతను ఈ చొరవ ప్రతిబింబిస్తుందని ఆయన హైలైట్ చేశారు. ఈ అధునాతన వ్యవస్థల ఏకీకరణ, ముఖ్యంగా క్లిష్టమైన మరియు అత్యవసర చికిత్స సందర్భాలలో, అత్యంత సురక్షితమైన రక్తం వీలైనంత తక్కువ సమయంలో లభించేలా చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది.

# బ్రహ్మా కుమారిస్ ఆధ్యాత్మిక ప్రధాన కేంద్రం

## - ప్రపంచంలోనే అతిపెద్ద సౌరశక్తితో నడిచే వంటశాలను నిర్వహిస్తూ అంతర్జాతీయ గుర్తింపు



**(రాజధాని వార్తలు):** రాజస్థాన్‌లోని ఆరావళి కొండల్లో ప్రశాంతంగా ఉన్న శాంతివన్-బ్రహ్మా కుమారిస్ ఆధ్యాత్మిక ప్రధాన కేంద్రం-ప్రపంచంలోనే అతిపెద్ద సౌరశక్తితో నడిచే వంటశాలను నిర్వహిస్తూ అంతర్జాతీయ గుర్తింపు పొందింది. ఇక్కడ రోజుకు 50,000 శాఖాహార భోజనాలు సిద్ధం చేయగల సామర్థ్యం ఉంది; నివాసితులు, వాలంటీర్లు, వేలాది సందర్శకులకు వడ్డిస్తారు.
టెక్నాలజీ: 84 భారీ పారాబొలిక్ రిఫ్లెక్టర్లు సూర్యుని కదలికను ఆటోమేటిక్‌గా ట్రాక్ చేస్తాయి. అవి సూర్యరశ్మిని కేంద్రీకరించి నీటిని మరిగించి రోజుకు 3,500 కిలోలకు పైగా హై-ప్రెజర్ స్టీమ్ ఉత్పత్తి చేస్తాయి. ఈ ఆవిరిని ఇన్సులేటెడ్ పైపుల ద్వారా నేరుగా భారీ వంట పాత్రలకు పంపిస్తారు.
ప్రభావం: సాధారణ పరిస్థితుల్లో ఎల్‌పిజి/డీజిల్ వంటి సాంప్రదాయ ఇంధనాలు అవసరం లేకుండా వంటశాల పని చేస్తుంది. దీని వల్ల ఏటా సుమారు 2,00,000 కిలోల వంట గ్యాస్ ఆదా అవుతుంది-పర్యావరణ స్థిరత్వానికి పెద్ద విజయం.

# భక్తి పారవశ్యంతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు...ఆకట్టుకున్న సిలువ యాత్ర



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఏసుక్రీస్తు సిలువలో మరణించిన సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవ ప్రజలు “గుడ్ ఫ్రైడే” శుభ శుక్రవారం ప్రార్థనలను అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. క్రైస్తవ ప్రజల ప్రధాన కార్యక్రమాల్లో ఒకటైన ఏసుక్రీస్తును సిలువకు అప్పగించిన సంద ర్భానికి సంబంధించి 40 రోజులపాటు క్రైస్తవ ప్రజలు ఉపవాస దీక్షను అవలంబించి ప్రత్యేక ప్రార్థనలు చేపడుతూ వస్తారు. దానిలో భాగంగానే ఏసుక్రీస్తును సిలువ వేసిన రోజుగా పిలువబడే గుడ్ ఫ్రైడే ప్రార్థనలు ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ ప్రజలంతా ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. దానిలో భాగంగానే పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట పెద్దాపురం పట్టణాలు మండలాల్లో క్రైస్తవ ప్రజలంతా వారి దేవాలయాల్లో కుటుం బాలుగా చేరి ఉపవాసముండి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనల్లో గడిపారు. ఈ సందర్భంగా దైవజనులు, క్రైస్తవ నాయకులు ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ధ్యానిస్తూ మానవుల పాపాలను పరిహరించేందుకు ఆయన చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు.

**ఆకట్టుకున్న ఆర్సీఎం సిలువ యాత్ర :**

గుడ్ ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా సామర్లకోట ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన యేసు క్రీస్తు సిలువ యాత్ర ప్రజలందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. రెండువేల సంవత్సరాల క్రితం ఏసుక్రీస్తు సిలువకు అప్పగింపబడగా ఆయన సిలువ యాత్రను కొనసాగించిన దృశ్యాలను కళ్ళకు కట్టినట్టు చూపించారు. చర్చి ఫాదర్ పీటర్ ఆధ్వ ర్యంలో ఏసుక్రీస్తుగా శేఖర్, పిలాతుగా కుంచె రాజేష్, సైనికులుగా పలువురు యువకులు ప్రత్యేక వేషధారణలతో ఈ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు వేషధారణలో ఉన్న యువకుడు శేఖర్ సిలువను లాగుతూ, ఏసుక్రీస్తు పొందిన శ్రమలను ప్రదర్శించగా అవి ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సామర్లకోట స్టేషన్ సెంటర్ నుండి పిఠాపురం మెయిన్ రోడ్డు మీదుగా బ్రౌన్ పేట సెం టర్లోని ఆర్సీఎం చర్చి వరకు ఈ సిలువ యాత్రను కొనసాగించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ప్రధాన దేవాలయాలైన సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, సెంటినరీ అగస్థాన లూథరన్ చర్చి, ఆంధ్ర జూబ్లీ బాప్టిస్ట్ చర్చి, ఇమ్మానియేల్ బాప్టిస్ట్ చర్చ్, బెరాక బాప్టిస్ట్ చర్చి, షాలేము బాప్టిస్ట్ చర్చ్‌లతో పాటు అన్ని క్రైస్తవ దేవాలయాల్లో ప్రజలు వందలాదిగా చేరి గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేపట్టారు.

